



బోనాలు ఎత్తుకొని వెళుతున్న మహిళలు

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

తిమ్మాపూర్, ఏప్రిల్ 14: మండల కేంద్రంలో గౌడ సంఘం, అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటికో బోనంతో నెత్తిపై ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మ వారికి నైవేద్యం సమర్పించారు. పిల్లాపాపలు, పంటలు చల్లగా చూడు అని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గౌడ, అంబేడ్కర్ సంఘం నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు, దళిత సంఘాల నాయకులు



అంబేద్కర్‌కు పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపి బండి సంజయ్‌కుమార్

అంబేద్కర్‌కు ఘన నివాళి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 14: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆదివారం కరీంనగర్ కోర్టు చౌరస్తాలోగల అంబేడ్కర్ విగ్రహానికి కలెక్టర్ పమేలా సత్పతి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవో కె మహేశ్వర్, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ నెతానియల్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున, డీఆర్డీవో శ్రీధర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, కరీంనగర్ అర్బన్, రూరల్ తహసీల్దార్లు ఎం రమేశ్, నవీన్‌కుమార్, రాజేశ్ పాల్గొన్నారు.

- ఎంపీ బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్ కుమార్‌తోపాటు ఇతర బీజేపీ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన తోపాటు మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ, సొల్లు అజయ్‌వర్మ పూలమాలవేసి నివాళులర్పించారు.
- ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారితోపాటు కార్పొరేటర్లు కుర్ర తిరుపతి, కంసాల శ్రీనివాస్, సరిళ్ల ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు.
- అంబేద్కర్ విగ్రహానికి నగర మేయర్ వై సునీల్‌రావు, జడ్పీ చైర్ పర్సన్ కనమల్ల విజయతోపాటు పలవురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.
- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు నాగుల నరసింహస్వామి, కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్, ఉపాధ్యక్షుడు రాజేశ్వర్ రావు, పట్టణ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్‌సింగ్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, రవీందర్, శైలజ, సత్యనారాయణ, ఈశ్వర్‌ప్రసాద్ పాల్గొన్నారు.
- సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి కోర్టు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వర్ల వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, జిల్లా కమిటి సభ్యుడు నరేష్, జి తిరుపతి, నవీన్, వంశీ, శ్రీనివాస్, మహేందర్ పాల్గొన్నారు.
- దళిత సంఘాల నాయకులు కోర్టు చౌరస్తాలోగల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేడి మహేశ్, మేడి అంజయ్య, దామెర సత్యం, సముద్రాల అజయ్, గోష్కి శంకర్, బొగ్గుల మల్లేశం, తీట్ల ఈశ్వరి, బిట్ల ప్రవీణ్‌కుమార్, దాసరి సురేష్ పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ

● అంబేద్కర్ ఆలోచన విధానానికి అనుగుణంగా కాంగ్రెస్ పాలన

- మంత్రి పొన్నం ప్రభాకర్

సుభాష్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచన విధానానికి అనుగుణంగా కాంగ్రెస్ పాలన సాగుతోందని రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తాలోగల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యమం ప్రమాదంలో పడిందదన్నారు. దేశంలో ఐక్యత, ప్రజాస్వామ్యం కాపాడుకోవాల్సిన అవసరముందని, అంబేడ్కర్ జయంతి సదర్భంగా ఆ దిశగా ముందుకు సాగేందుకు అందరూ ప్రతిన పూనాలన్నారు. కార్యక్రమంలో మానకొండురు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, కోడూరి సత్యనారయణ గౌడ్, వెన్న రాజమల్లయ్య పాల్గొన్నారు.

● అంబేద్కర్‌ను అవమానించిన పార్టీ కాంగ్రెస్

- ఎంపీ బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అడుగడుగునా అవమానించిన పార్టీ కాంగ్రెస్ అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని పార్లమెంట్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ అంబేద్కర్‌కు భారతరత్న ఇవ్వకుండా చట్ట సభల్లో అడుగు పెట్టకుండా కుట్ర చేసి ఓడించింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. నెహ్రూ అశాస్త్రీయమైన విధానాలను ప్రశ్నించారనే అక్కసుతో కుట్రలు చేసి రెండు సార్లు ఓడించారన్నారు. ప్రపంచ దేశాలకే అతి పెద్ద ప్రజాస్వామ్య పుట్టినిల్లుగా భారత్ నిలిచిందంటే అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే కారణమన్నారు. జనసంఘ్ పార్టీ అంబేద్కర్‌ను బెంగాల్ నుంచి ఎమ్మెల్సీగా చేసిందన్నారు. వాజ్‌పేయి, అడ్వానీ ఒత్తిడితోనే వీపీ సింగ్ ప్రభుత్వం అంబేద్కర్‌కు భారత రత్న పురస్కారానికి ప్రకటించిందన్నారు. అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తున్న నరేంద్ర మోదీ మరో సారి ప్రధాని కావాలన్నారు.

అయ్యప్ప ఆలయంలో ఘనంగా విషు పూజ



అయ్యప్పస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 14: నగరంలోని జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప ఆలయంలో కేరళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని విషు పూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి హోమం, అయ్యప్ప స్వామికి ఫల రస పంచామృతాభిషేకం, సాయంత్రం పడిపూజ, అల్పాహారం రాచకొండ చక్రధర్‌రావు ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో ఈఓ కొన్న కాంతారెడ్డి, అర్చకులు, సిబ్బంది, భక్తులు, దీక్షాపరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ

● సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మిల్కూరి వాసుదేవరెడ్డి

జమ్మికుంట, ఏప్రిల్ 14: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి విమర్శించారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి 700 మంది రైతులను పొట్టన పెట్టుకుందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని ప్రకటించి పట్టించుకోవడం లేదన్నారు. 44కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చింద న్నారు. ప్రజలు మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శీలం అశోక్, వెల్మారెడ్డి రాజిరెడ్డి, బాసర సంపత్‌రావు, గుండేటి వాసుదేవ్ పాల్గొన్నారు.

ఒక్క ఆలయానికీ నిధులు తేలేని అసమర్థ ఎంపీ సంజయ్

- బీజేపీ అధ్యక్ష పదవి తొలగింపునకు అవినీతే కారణమని ప్రచారం జరుగుతోంది
- నిరసన దీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 14: ప్రసాద్ స్కీం ద్వారా దేశంలోనే అన్ని ఆలయాలకు కేంద్రం నిధులు ఇస్తే ఉమ్మడి జిల్లాలోని వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం దేవాలయాలకు నిధులు తేలేని అసమర్థ ఎంపీ బండి సంజయ్ అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. పదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విభజన హామీలను అమలు చేయకుండా తెలంగాణకు అన్యాయం చేసిందంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డీసీసీ కార్యాలయంలో నిరసన దీక్ష చేపట్టారు. మంత్రి మొదట అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బండి సంజయ్ ఎంపీగా ఐదు సంవత్సరాల్లో ఒక్క అభివృద్ధి, సంక్షేమ పథకాన్ని తీసుకురాలేదని విమర్శించారు. పార్లమెంట్ నియోజకవర్గానికి విద్యా సంస్థలు, వైద్య సంస్థలు తేలేదన్నారు. రైతులు కల్లాల్లో పడి చనిపోతే, ముంపు బాధితులు ఆందోళన చెందుతుంటే, సిరిసిల్ల నేత కార్మికులు చనిపోతే కనీసం పరామర్శకు రాలేదన్నారు. తాను ఐదేళ్లు ఎంపీగా ఉన్న సమయంలో పాస్‌పోర్ట్ కార్యాలయం, తిరుపతికి రైలు, ఎఫ్‌ఎం రేడియో స్టేషన్, కేంద్రీయ విద్యాలయం, మోడల్ స్కూల్ తీసుకువచ్చానని, సంజయ్ తన హయాంలో ఏ పథకాలు తీసుకోవచ్చాడో ప్రజలకు చెప్పి ఓట్లు అడగాలన్నారు. బండి సంజయ్ పక్కా హిందువునని చెప్పుకుంటాడు కానీ.. ముక్క, చుక్క లేనిదే ఆయనకు రోజు గడవదన్నారు. సంజయ్ పోలీసులను రక్షణగా పాదయాత్ర సాగించాడని అన్నారు. తాను రాముడి జన్మ గురించి ఏనాడు మాట్లాడలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ కాంగ్రెస్ గ్యారంటీల గురించి అడుగుతున్నారని, తాము అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అయిందని, 10 సంవత్సరాలు అధికారంలో ఉండి ఇచ్చిన హామీలు ఈ మేరకు అమలు చేశారో వెల్లడించాలన్నారు. తెలంగాణ అమరవీరుల గురించి పార్లమెంటులో ప్రధాని మోదీ అవమానకరంగా మాట్లాడుతుంటే ఎంపీ బండి సంజయ్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో తెలంగాణ విభజన హామీలు అమలు కాలేదని, దీనికి నిరసనగా దీక్ష చేపట్టానన్నారు. ఎస్‌ఐడీపీ కింద అనేక రాష్ట్రాలకు నిధులు వస్తే స్థానిక పార్లమెంటు సభ్యుడు మాత్రం ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. తన తల్లి గురించి మాట్లాడిన బండి సంజయ్ తన సమాధిని తానే కట్టుకున్నాడని అన్నారు. బండి సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి తప్పించడానికి కారణం అతను చేసిన అవినీతి కాదా? అని ప్రశ్నించారు. ఇదే విషయం బీజేపీ వర్గాల్లో కోడై కూస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం 10 సంవత్సరాల్లో తెలంగాణ ప్రయోజనాలు కాపాడేందుకు, ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ఏమి చేశారో చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు.



నిరసన దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

● బీఆర్ఎస్‌ను తెలంగాణ ప్రజలు పక్కన పెట్టారు

తెలంగాణ సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీలో తెలంగాణ తీసివేసి బీఆర్ఎస్‌గా మార్చుకున్నప్పుడే తెలంగాణ ప్రజలతో పేగుబంధం తెంచుకుందని, ఆ పార్టీని తెలంగాణ ప్రజలు పక్కన పెట్టారన్నారు. తెలంగాణ ప్రజలకంటే ఆంధ్రప్రదేశ్ ప్రజలు గొప్పవారని కేటీఆర్ వాఖ్యలు చేయడం ఆ పార్టీ నాయకులకు తెలంగాణ ప్రజలపై ఉన్న ప్రేమను తెలుపుతుందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రస్తుతం పోటీలోనే లేదని మంత్రి అన్నారు. బీజేపీ శ్రీరాముడు పేరుతో ఇంటింటికి అక్షింతలు పంచు తూ, దేవుడి పేరుతో ఓట్లు అడిగి రాజకీయం చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. బండి సంజయ్ చేసిన ఒక్క పని చూపించాలని, తాను చేసిన 20 పనులు చూపిస్తానన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రకృతి వైపరీత్యాలతో పంటనష్టపోయిన రైతులకు 2,500 రూపాయలు కూడా పరిహారం ఇవ్వలేదని, ఇప్పుడు 25 వేలు ఇవ్వాలని కేటీఆర్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. వచ్చే 40 రోజులు కార్యకర్తలు కష్టపడాలని, పార్టీ గెలుపుకోసం అలుపెరగకుండా పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జి నరసింహారెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, కోడూరు సత్యనారాయణగౌడ్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు పురుమల్ల శ్రీనివాస్, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వొడితెల ప్రణవ్, వైద్యుల అంజన్ కుమార్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఆకారపు భాస్కర్‌రెడ్డి, ఎండీ తాజ్, కొరివి అరుణ్‌కుమార్, పులి ఆంజనేయులుగౌడ్, కర్ర సత్యప్రసన్నరెడ్డి, మల్యాల సుజిత్‌కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో అలసత్వం చేయొద్దు

- కొనుగోలుకేంద్రాలను పరిశీలించిన డీఆర్డీవో శ్రీధర్
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

గంగాధర, ఏప్రిల్ 14: ధాన్యం సేకరణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసకుంటామని డీఆర్డీవో శ్రీధర్ సిబ్బందిని, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను హెచ్చరించారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'ధాన్యాన్ని కాపా డుకునేందుకు రైతుల అష్టకష్టాలు' అనే శీర్షి కతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన డీఆర్డీవో శ్రీధర్ మండ లంలోని మధురానగర్, నారాయణపూర్, నాగిరెడ్డిపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి మిల్లులకు పంపించాలన్నారు. ఎక్కడా రైతులకు నష్టం జరగకుండా తూకం వేయాలని, ధాన్యం సేకరణ పూర్తయ్యేవరకు అధికారులు పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. కేంద్రాల్లో రైతులకు సరిపడా టార్పాలిన్లు, విద్యుత్ సౌకర్యం, మంచినీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కేంద్రాల్లో గోనె సంచుల కొరత లేకుండా చూసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. వరి ధాన్యానికి ఏ గ్రేడుకు క్వింటాల్‌కు 2,203, సాధారణ రకానికి 2,183 రూపాయలను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఆయన వెంట డీపీఎం ప్రవీణ్, ఏపీఎంలు రాజేశం, పవన్‌కుమార్, సీసీలు ఉమామహేశ్వరి, శైలజ, వీవోఏలు వసంత, నిర్మల, స్వరూప ఉన్నారు.



నాగిరెడ్డిపూర్‌లో ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శ్రీధర్



ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 14: జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పోలీస్‌లు పట్టుకున్నారు. పోతిరెడ్డిపల్లి మానేరు వాగు నుంచి ఇసుక తీసుకు వస్తున్నట్లు గుర్తించి ట్రాక్టర్ డ్రైవర్ జన అరవింద్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్టారీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

వృద్ధుడి అదృశ్యం

జమ్మికుంట, ఏప్రిల్ 14: జమ్మికుంట మండలం పెద్దంపల్లి గ్రామానికి చెందిన గాజుల పరుశురాములు (70) అనే వృద్ధుడు అదృశ్యం అయినట్లు ఆదివారం పోలీస్‌లు తెలిపారు. గత నెల 28న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన తన తండ్రి ఆచూకీ తెలియడం లేదని కుమారుడు మల్లయ్య పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు.

గతంలో కూడా ఇదే విధంగా ఇంట్లో నుంచి వెళ్లిపోయి మళ్లీ నాలుగైదు రోజులకు తిరిగి వచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కుమారుడు మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

కోనరావుపేట, ఏప్రిల్ 14: కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన ముష్కం లక్ష్మీరాజం (60) అప్పుల బాధతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముష్కం లక్ష్మీరాజం అస్తమాతో బాధపడుతున్నాడు. రెండేళ్ల క్రితం అస్తమాకు సంబంధించిన ఆపరేషన్ చేయగా నాలుగు లక్షల వరకు ఖర్చయ్యింది. ఆరోగ్యం పూర్తిగా కుదుట పడలేదు. ఆసుపత్రి కోసం చేసిన అప్పులు తీర్చలేక, ఆరోగ్యం సహకరించక మనోవేదన గురై ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి బావుసాయిపేట గ్రామ శివారులోని మర్రిచెట్టుకు ఉరేసుకున్నాడు. అటుగా వెళ్లిన గ్రామస్థులు వెంకటేశం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. లక్ష్మీరాజం భార్య రామవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




















వృద్ధురాలి ఆత్మహత్య


భూక్య పంతులి

వీర్నపల్లి, ఏప్రిల్ 14: కుటుంబ కలహాలతో ఉరేసుకొని వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన వీర్నపల్లి మండలం మద్దిమల్ల తండా గ్రామం లో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భూక్య పంతులి (65) భర్త సీతారాం అప్పుల బాధతో ప్రతిరోజు తాగుతూ గొడవకు దిగేవాడు. శనివారం రాత్రి తన భర్త తాగి గొడవ పడడంతో జీవితంపై విరక్తి చెంది ఇంటి ముందు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం ఉదయం చెట్టుకు ఉరేసుకున్న పంతులిని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రమేష్ సంఘటన స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతురాలికి భర్త సీతా రాం, కుమారులు రాములు నాయక్, భీమా నాయక్ ఉన్నారు.

కళాశాలలో చోరీ

మల్యాల, ఏప్రిల్ 14: మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దొంగ తనం జరిగింది. కళాశాలలోని ప్రిన్సిపాల్ గది, ఎగ్జామినేషన్ గది తాళాలు పగులగొట్టి అందులోని మానిటర్, సీపీయూలోని హార్డ్‌డిస్క్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ నెల 11న కళాశాలకు తాళం వేయగా ఆదివారం అటెండర్ మునుగూరి రాకేష్ తాళాలు తీయడానికి రాగ దొంగ తనం జరిగినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

రాజన్న క్షేత్రంలో భక్తుల సందడి


క్యూలైన్లో బారులు తీరిన భక్తులు


కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ, ఏప్రిల్ 14: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తొలుత ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి తమ ఇష్ట దైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని తరించారు. కళాభవన్‌లో శ్రీ స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర అర్జిత సేవలలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ దేవాలయం, శ్రీ భీమేశ్వరాలయం సైతం భక్తులతో కిక్కిరిసిపోయాయి. పెద్దసంఖ్యలో భక్తులు బద్దిపోచమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

నెమలి వాహనంపై స్వామివార్ల విహారం

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రంలో శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభస్వామివారలు నెమలి వాహనంపై విహరించారు. శ్రీ రాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవరాత్రి ఉత్సవాల కార్యక్రమాలలో భాగంగా ఆదివారం ఉదయం శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ అనంత పద్మనాభస్వామివారల ఉత్సవ విగ్రహాలను నెమలి వాహనంపై ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పట్టణ వీధుల మీదుగా శోభాయాత్ర నిర్వహించారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న రేషన్ బియ్యం

మంథని, ఏప్రిల్ 14: పట్టణ శివారులోని ఆర్టీసీ బస్సు డిపో చౌరస్తా సమీపంలో ఆటో ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న దాదాపు 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం పట్టుకున్నారు. రేషన్ షాపుల ద్వారా సేకరిం చిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా డిపో సమీపంలో మంథనికి చెందిన పలువురు పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. సంచుల్లో టీఎస్ 02 యూబీ 2032 అనే అశోక లేలాండ్ ఆటో ట్రాలీలో దాదాపు 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. రేషన్ డీలర్ల నుంచి సేకరించిన ఈ బియ్యాన్ని పార్వతి బ్యారేజీ మీదుగా జైపూర్, చెన్నూరు మండలాల నుంచి సరిహద్దుల్లో ఉన్న మహారాష్ట్రలోని సిరోంచ ప్రాంతానికి తరలించి అధిక ధరలకు కొందరు స్మగ్లర్లు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పేదలకు ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతున్న రేషన్ బియ్యాన్ని కొంత మంది అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

అంతర్గాం, ఏప్రిల్ 14: రామగుండం - పెద్దంపేట రైల్వే స్టేషన్ల మధ్య గురుకుల పాఠశాల సమీపంలో ఎగువ వైపు పట్టాలపై ఆదివారం గుర్తు తెలియని రైలు కింద పడి రామగుండం పట్టంలోని భీమయ్య కాలనీకి చెందిన దండుగుల అంజి(29) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు అంజి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబ సమస్యల కారణంగా రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని సందర్శించిన జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, మృతుని భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

మానకొండూర్, ఏప్రిల్ 14: అనారోగ్యంతో బాధపడుతూ ఓ వృద్ధుడు ఆదివారం వ్యవసాయ బావిలో పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన రామగిరి లింగయ్య (85) అనే వృద్ధుడు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. ఉదయం ఇంటి నుంచి వెళ్లి సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీసారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాటి చెట్టు పైనుంచి పడి ఒకరి మృతి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 13: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌కు చెందిన బీమారి దేవయ్య(55) ఆదివారం తాటి ముంజలు కోసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి కింద పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. దేవయ్య గ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఆదివారం ఉదయం గ్రామ శివారులోని మైసమ్మ చెరువు ప్రాంతంలోని తాటి ముంజలు కోసేందుకు వెళ్లాడు. తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడడంతో అక్కడికక్కడే చనిపోయాడు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

కాల్పుల కేసులో నిందితుడి అరెస్ట్

● తపంచా, ఆరు బుల్లెట్లు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన ఏసీపీ గజ్జి కృష్ణ


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ


స్వాధీనపర్చుకున్న తపంచా, బుల్లెట్లు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 14: రెండు కుటుంబాల మధ్య భూతగాదాలు హత్యాయత్నానికి దారితీశాయి. తపంచాతో కాల్పులకు పాల్పడ్డ నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలను ఏసీపీ గజ్జి కృష్ణ తన కార్యాలయంలో ఆదివారం వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం అనుబంధ గ్రామం ఊషన్నపల్లి గ్రామానికి చెందిన ముస్కు మల్లారెడ్డి కుటుంబానికి, ముస్కు రామయ్య కుటుంబానికి కొన్నేళ్లుగా పెద్దంపేట్ గ్రామశివారులోగల 5 ఎకరాల వ్యవసాయ భూమి గురించి వీరి మధ్య వివాదం నడుస్తోంది. దీనిపై మల్లారెడ్డి కుటుంబం 2017లో కోర్టును ఆశ్రయించగా అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో మల్లారెడ్డిపై కక్ష పెంచుకున్న రామయ్య భూమి దక్కించుకోవడానికి అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. 2018లో కాల్వశ్రీరాంపూర్ మండలం కొదురుపాక వద్ద గల ఇటుక బట్టీలో రామయ్య పనిచేస్తున్న క్రమంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కార్మికులతో పరిచయం ఏర్పడింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రాలో తుపాకులు దొరుకుతాయని తెలుసుకున్న రామయ్య మూడుసార్లు యూపీకి వెళ్లి ప్రయత్నించినా లభించలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 20న రామయ్య ఆగ్రాకు వెళ్లి ముప్పై వేలకు గుర్తుతెలియని వ్యక్తి వద్ద తపంచా, ఆరు తూటాలు కొనుగోలు చేశాడు. మార్చి 29న ఉదయం మల్లారెడ్డి తన మొక్కజొన్న చేనులో నీరు పెడుతుండగా రామయ్య తపంచాతో కాల్పులు జరుపగా గురి తప్పింది. మల్లారెడ్డి కేకలు వేయడంతో రామయ్య అక్కడి నుంచి పారిపోయాడు. ఈ సంఘటనపై మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కాల్వశ్రీరాంపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని నింతుడి కోసం గాలింపు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న రామయ్య భయపడి కరీంనగర్, మహారాష్ట్రలోని పలుచోట్ల బంధువుల ఇళ్లలో తలదాచుకున్నాడు. ఈనెల 14 ఉదయం డబ్బుల కోసం ఊషన్నపల్లికి వచ్చిన రామయ్య తన మేనకోడలు సంగీత వద్ద ఉన్నట్లు సమాచారం అందుకున్న కాల్వశ్రీరాంపూర్ ఎస్సై ఓంకార్‌యాదవ్ రామయ్య అదుపులోకి తీసుకున్నాడు. తపంచా కోసం విచారించగా తన ఇంటి పక్క భూమిలో పాతిపెట్టినట్టు తెలిపాడు. తపంచా, తూటాలను స్వాధీనం చేసుకొని నిందితుడు రామయ్యను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ వివరించారు. ఈ కేసును చేధించిన సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, కాల్వశ్రీరాంపూర్ ఎస్సై ఓంకార్‌యాదవ్, ఏఎస్సై తిరుపతి, కానిస్టేబుల్ రాజేందర్, అశోక్‌తో పాటు సిబ్బందిని ఏసీపీ అభినందించారు. ఈ సమావేశంలో సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, కాల్వశ్రీరాంపూర్ ఎస్సై ఓంకార్ యాదవ్, పెద్దపల్లి ఎస్సై లక్ష్మణ్‌రావు, కాల్వశ్రీరాంపూర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల ఇళ్లలో పోలీసుల దాడులు

- కిలోన్నర బంగారం, ఏడు లక్షల నగదు స్వాధీనం


సొమ్మును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మెట్‌పల్లి, ఏప్రిల్, 14 : మెట్‌పల్లి పట్టణంలోని వడ్డీ వ్యాపారస్థుల ఇండ్లలో పోలీసులు ఆదివారం కూడా దాడులు నిర్వహించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా పాన్ బ్రోకర్స్ పేరుతో బంగారాన్ని తాకట్టు పెట్టుకొని అధిక వడ్డీలతో వ్యాపారం చేస్తున్నారని సమాచారం మేరకు దాడులు చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలోని కటకం ప్రకాష్, కటకం రమేష్, కటకం శివ, కటకం కార్తీక్ ఇండ్లలో దాడులు నిర్వహించినట్లు ఆదివారం సీఐ నవీన్‌కుమార్, ఎస్సై చిరంజీవి తెలిపారు. శనివారం మధ్యాహ్నం మొదలైన దాడులు అర్ధరాత్రి వరకు కొనసాగించినట్లు వారు వివరించారు. వారి వద్ద నుంచి తాకట్టు పెట్టుకున్న సుమారు రూ. 90లక్షల విలువ గల కిలోన్నర బంగారం, రూ. 7లక్షల నగదును స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసుల అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం అనుమతులకు చట్టపరమైన నిబంధనలకు లోబడి వ్యాపారాలను నిర్వహించాలన్నారు. కటకం బ్రదర్స్ గత సంవత్సరంలో అధిక వడ్డీలకు పాల్పడుతున్నరని ఫిర్యాదుల మేరకు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశామన్నారు. మళ్లీ కటకం బ్రదర్స్ 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి నేటి వరకు ఎలాంటి అనుమతులు లేకుండా బంగారం తాకట్టు పెట్టుకొని అధిక వడ్డీలకు పాల్పడ్డారని సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, రికార్డు అసిస్టెంట్ గోరుమంతుల సుధాకర్, అధికారులు, పోలీసి సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి


వెంకటేశ్వర్లు (ఫైల్)

ఏసీసీ, ఏప్రిల్ 14: మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని రైలు ఢీకొని గాయాలపాలైన యువకుడు ఆదివారం మృతిచెందాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా సైదాపూర్‌కు చెందిన ఇల్లందుల వెంకటేశ్వర్లు(34) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం మంచిర్యాలలోని బంధువుల ఇంటికి వచ్చి రాత్రి ముఖరాం చౌరస్తాలో స్నేహితున్ని కలుస్తానని చెప్పి బంధువుల ఇంటి నుంచి బయటకు వెళ్లాడన్నారు. మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో కాజీపేట నుంచి బల్లార్షా వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు ఢీకొని గాయా లపాలయ్యాడన్నారు. మంచిర్యాలలోని ఆసుపత్రిలో చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆదివారం సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలి స్తుండగా మధ్యాహ్నం మృతిచెందాడన్నారు. మృతునికి భార్య శ్రీలేఖ, కొడుకు, కూతురు ఉన్నారన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని ఎస్ఐ సుధాకర్ ఆదేశాల మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హుజూరాబాద్, ఏప్రిల్ 14: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దమ్మక్కపేట శివారులోని చెరువుకుంటలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం దమ్మక్కపేట శివారులోని చెరువుకుంటలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 4500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

ఓదెల, ఏప్రిల్ 14: మండలంలోని కొలనూర్‌కు చెందిన కొంగరి స్వప్న (29) చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబ సభ్యులు, పొత్కపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొలనూర్ గ్రామానికి చెందిన కొంగరి స్వప్న గత కొంతకాలంగా అందంగా లేనని, పెళ్లి సంబంధాలు కుదరడం లేదని మనోవేదకు గురైంది. ఈ నెల 12వ తేదీన తెల్లవారుజామున పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గుర్తించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని అపోలో ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్ఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

లాటరీ టికెట్లు అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

కోల్‌సిటీ, ఏప్రిల్ 14: గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌కు చెందిన కోట సత్యనారాయణ అనే వ్యక్తి గత కొంత కాలంగా కేరళ రాష్ట్రం నుంచి లాటరీ టికెట్లు తీసుకుని వచ్చి అమ్ముతుండగా ఆదివారం వన్‌టౌన్ ఎస్ఐ సుగుణాకర్ అరెస్టు చేశారు. కేరళలో రూ.5ల కమీషన్‌తో గోదావరిఖని పట్టణంలో ప్రజలకు లాటరీ టికెట్లు విక్రయిస్తున్నారని, తెలంగాణ లాటరీ టికెట్లపై నిషేధం ఉన్నందున సత్యనారాయణను అరెస్టు చేసినట్టు తెలిపారు.

కాంగ్రెస్‌ను భూస్థాపితం చేయాలి

●ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ


సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 14: మాదిగల ద్రోహి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాదిగలను అవమానించిన కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో భూస్థాపితం చేయాలని, బీజేపీని గెలిపించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో ఎస్సీలకు ఎంపీ అభ్యర్థులుగా మూడు సీట్లు ఉంటే అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు కాంగ్రెస్ ఒక్క సీటు కూడా ఇవ్వకుండా ద్రోహం చేసిందన్నారు. దళితుల్లో 20 శాతం ఉన్న మాలలకు రెండు సీట్లు, ఊరుకొక్క కుటుంబం ఉండే బైండ్ల కులానికి ఒక సీటు ఇచ్చారన్నారు. దళితుల్లో 75 శాతం ఉండే మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఐదు శాతం జనాభా ఉన్న రెడ్డి కులానికి రేవంత్‌రెడ్డి ఆరు సీట్లను కేటాయించుకున్నారన్నారు. మాదిగల మద్దతుతోనే ఈ స్థాయికి ఎదిగానంటూ అనేక వేదికలపైన చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలకు ఎన్నికల్లో అవకాశం ఇవ్వకుండా అవమానించారన్నారు. మాదిగలకు ద్రోహం చేసిన పార్టీలను గతంలో భూస్థాపితం చేశామని, అదే గతి రేపు కాంగ్రెస్ పార్టీకి పడుతుందని హెచ్చరించారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించడం కోసం మాదిగలంతా ఏకం కావాలన్నారు. ఒక్క సీటు కూడా కేటాయించని కాంగ్రెస్ పార్టీని ఓడించాలని, బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఆర్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి వెంకటస్వామి, కరీంనగర్ అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్, సిరిసిల్ల కన్వీనర్ ఎలగందుల భిక్షపతి, రాష్ట్ర నాయకులు ఆవు నూరి ప్రభాకర్, గుండా థామస్, గుండ్రెడ్డి రాజు, బొల్లారం చంద్రమౌళి, నేరెళ్ల శ్రీనివాస్, బేస్ కుమార్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 14: ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలోని జక్కుల శ్రీనివాస్ ఇంటిలో అక్రమంగా నిల్వ చేసిన రూ.2వేల విలువైన మద్యం సీసాలను శనివారం రాత్రి స్వాధీనపర్చుకున్నామని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో శ్రీనివాస్ తన ఇంటిలో మద్యం సీసాలను నిల్వ చేశాడనే సమాచారంతో దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. మద్యం సీసాలను స్వాధీన పర్చుకుని శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

● శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ వైన్స్‌లో బెల్ట్‌షాప్ నిర్వాహకుడు మద్యం కొనుగోలు చేసి తీసుకెళ్తుండగా ఆదివారం పట్టుకున్నట్లు ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాపూర్‌కు చెందిన పోలు శ్రీకాంత్ అక్రమంగా బెల్ట్ షాపు నడుపుటకు రూ.13,090 విలువ గల మద్యాన్ని మొలంగూర్ వైన్స్‌లో కొనుగోలు చేసి తీసుకెళ్తుండగా పట్టుకున్నామన్నారు. మద్యం స్వాధీనం చేసుకొని శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అగ్నిమాపకశాఖ అమరవీరులకు నివాళి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్14: విధి నిర్వహణలో సేవలు అందిస్తూ ప్రమాదాల బారిన పడి మరణించిన అగ్నిమాపకశాఖ అమరవీరులకు కరీంనగర్ అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. అగ్నిమాపక వారోత్స వాలలో భాగంగా కరీంనగర్ ఫైర్ డివిజన్ ఆఫీస్, ఫైర్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి అమరవీరులకు డి.ప్రభాకర్, కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ టి పరమేశ్వర్‌లతో పాటు సిబ్బంది 2 నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

కాంగ్రెస్ పార్టీ గుల్బర్గా పరిశీలకులుగా సిరాజ్ హుస్సేన్

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 14: కరీంనగర్ నియోజకవర్గానికి చెందిన జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె సిరాజ్ హుస్సేన్‌ను కాంగ్రెస్‌పార్టీ గుల్బర్గా నియోజకవర్గానికి పరిశీలకులుగా నియమిస్తూ ఏఐసీసీ మైనారిటీ విభాగం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఇమ్రాన్ ప్రతాప్‌గరీ ఉత్తర్వులు జారీ చేశారు. తనకు బాధ్యతలు అప్పగించడంలో కీలకంగా వ్యవహరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సుందరకాండ హవనం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 14: వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తిరుమలనగర్‌లోని శ్రీనిలయంలో ఆదివారం ఆరవరోజు మయూరగిరి పీఠాధిపతి నమిలకొండ రమణాచార్యస్వామి ఆధ్వర్యంలో శ్రీరామ, ఆంజనేయస్వామి వారలకు అభిషేక, అర్చనలు, సుందరకాండ హవనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం ప్రతియేటా ఈ ఉత్సవాలను జరుపుతున్నామని రమణాచార్యస్వామి అన్నారు. కార్యక్రమంలో సము ద్రాల వేణుగోపాలాచార్యులు, రామకృష్ణమాచార్యులు, గోపీశర్మ, శివరామకృష్ణశర్మ పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో లింగార్చన

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 14: వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం హెలీప్యాడ్ గ్రౌండ్ ప్రక్కన గల ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో, యాగశాలలో నిత్య పూజలు, హోమాలు, అభిషేకాలు ఘనంగా జరిగాయి. ప్రత్యేకంగా జరిగిన అష్టవింశోత్తర శత లింగార్చనలో మేయర్ యాదగిరి సునీల్‌రావు పాల్గొని పూజలు జరిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్, వేంకట్‌రావు, ప్రవీణ్, నాగరాజు, ప్రభాకర్, ఆలయ కమిటీ బాధ్యులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

కథల పోటీకి ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 14: భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నేరము, పరిశోధనతో పాటు ఆద్యంతం సస్పెన్స్‌తో కూడిన అచ్చులో ఉన్న నాలుగు పేజీలకు మించని క్రైమ్ కథలను రచయితల నుంచి ఆహ్వానిస్తున్నట్లు అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.2016, రూ.1516, రూ.1016తో పాటు ముగ్గురికి ప్రోత్సామక బహుమతుల కింద రూ.516 చొప్పున అందిస్తామని పేర్కొన్నారు. పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పుస్తకం, ప్రశంసా పత్రాలు అందజేయబడుతాయని, కథలను 9014559059 నెంబరుకు రాతపూర్వక హామీ పత్రంతో ఏప్రిల్ 20వ తేదీ లోపు పంపాలని కోరారు. బహుమతి పొందిన కథలతో పాటు ఎంపిక చేసిన మరో 15 కథలతో పుస్తకం ముద్రిస్తామని తెలిపారు.

రామకృష్ణకు డాక్టరేట్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 14: మానస సరోవర్ గ్లోబల్ విశ్వవిద్యాలయం విద్యావిభాగ పరిశోధకులు దొంతుల రామకృష్ణకి విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య మనోజ్ నెహ్రా డాక్టరేట్ ప్రకటించారు. డాక్టర్ డి రామకృష్ణ డెవలప్‌మెంట్ ఆఫ్ సెన్సివిటీ ఇట్స్ ఇంపాక్ట్ ఆన్ ప్రొఫెషనల్ బి ఎడ్ స్టూడెంట్స్ అనే అంశంపై విద్యా విభాగ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ రాజ్‌కిషోర్ పారక్ పర్యవేక్షణలో సిద్ధాంత వ్యాసం పూర్తి చేశారు. కరీంనగర్‌కు చెందిన రామకృష్ణ 24 సంవ త్సరాల నుండి విద్యారంగంలో సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఎంఎస్‌బిఎడ్ కళాశాల ఆసిఫాబాద్ కరస్పాండెంట్‌గా ఉన్నారు.

సర్వాయి పాపన్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 14: తెలంగాణ రాష్ట్ర సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా కోడూరు పరుశురాంగౌడ్ ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం వ్యవస్థాపక అధ్యక్షుడు వీరగోని పెంటయ్య అధ్యక్షతన కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగం సత్తయ్యగౌడ్, కలర్ సత్తన్నగౌడ్, సంపునూరి మల్లేశం, కర్బూజ తిరుపతిగౌడ్, గోపగాని సారయ్యగౌడ్, చర్లపల్లి రాజేశ్వర్, గుడాల రాజేష్, తాళ్లపల్లి లింగయ్య కట్ట నర్సాగౌడ్ పాల్గొన్నారు.

రామాయణం మానవకోటికి సంపద వంటిది

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 14: శ్రీమన్నారాయణుని అవతారమైన రాముని చరిత్రను వివరించే బీజాక్షరాలతో కూడిన శ్రీమద్రామాయణం మానవకోటికి సంపద వంటిదని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి అన్నారు. జెట్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో పద్మనాయక కల్యాణ మండపంలో జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో ఐదవ రోజు ఆదివారం ఉదయం, సాయంత్రం స్వామి ప్రవచనం చేశారు. ఉదయం శ్రీమద్రామాయణ హవనం, తీర్థగోష్ఠి, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఉమ్మడి జిల్లాకు చెందిన సుమారు 3000 మంది వైష్ణవులుగా మారడానికి నిర్ణయించుకున్న వారికి స్వామి సమాశ్రయణములు చేశారు. కార్యక్రమంలో చల్మెడ లక్ష్మీనరసింహరావు, వీర్ల ప్రభాకర్‌రావు, కలకొండ గౌతమరావు, బీవీ రావు, యాద కిషన్, ఎల్ భూపతిరావు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు ఎవరూ అతిక్రమించవద్దు


ఇల్లందకుంటలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

ఇల్లందకుంట, ఏప్రిల్ 14: పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఎవరు ఎన్నికల నియమావళిని అతిక్రమించవద్దని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. ఆదివారం ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఏసీపీ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా రాజకీయ నాయకులు ఎన్నికల నియమావళిని ఉల్లంగించవద్దని, ఫ్లెక్సీలు కూడా పెట్టవద్దన్నారు. కార్యక్రమంలో సీఐ కోరే కిశోర్, ఎస్‌ఐలు రాజకుమార్, తోట తిరుపతి, ఈవో కందుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ కల్యాణ వేడుకలు ఘనంగా జరుపుకోవాలి



కందుగులలో మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ మండలాధ్యక్షుడు

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 14: హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణమహోత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకోవాలని విశ్వహిందూ పరిషత్ మండలాధ్యక్షుడు కంకణాల రమేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కందుగుల గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకొని ప్రతి గ్రామంలోని రామోత్సవాలు జరపాలన్నారు. ప్రతి ఇంటిపై కాషాయ ధ్వజం ఎగరాలనే లక్ష్యం పెట్టుకోవాలన్నారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ మండల కార్యదర్శి భూషబోయిన చంద్రయ్య, ధర్మప్రసాద్, మండల ప్రముఖ్ ఎలగందుల ప్రభాకర్, విశ్వహిందూ పరిషత్ గ్రామ శాఖ అధ్యక్షుడు కురిమిళ్ల రాజు, కార్యకర్తలు గణేష్, వివిధ గ్రామాల అధ్యక్షులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో వాహనాల తనిఖీలు

జమ్మికుంట, ఏప్రిల్ 14: జమ్మికుంట పట్టణంలోని గణేష్ నగర్‌లో పట్టణ సీఐ వరంగంటి రవి ఆధ్వర్యంలో సీఐఎస్‌ఎఫ్ బలగాలు ఆదివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అదే విధంగా వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు


హుజూరాబాద్‌లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి


కరీంనగర్‌లో నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ


కొత్తపల్లిలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు

కరీంనగర్ టౌన్/భగత్‌నగర్, ఏప్రిల్ 14: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు కోర్టు చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నగర యూత్ అధ్యక్షుడు కుల్దీప్ వర్మ, చేతి చంద్రశేఖర్, నాగరాజులు నివాళులు అర్పించారు.

● భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో రాగి సత్యనారాయణ విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జానపట్ల స్వామి, ఎడమ సత్యనారాయణ రెడ్డి, బండ రమణారెడ్డి, శ్రీనివాస్ (బాలు) పాల్గొన్నారు.

●తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ ప్రభుదాస్, సురేష్, వెంకటయ్య, ప్రేమానంద్, మురళి, మెరుగు ప్రవీణ్ పాల్గొన్నారు.

●తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ నియోజక వర్గ కార్యాలయంలో నగర అధ్యక్షుడు శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కళ్యాడపు ఆగయ్య, ఎడ్ల వెంకటయ్య పాల్గొన్నారు.

● రజక సంఘాల వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు.

●వినాయక్‌నగర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శీతాల రమేష్ చంద్ర, చంద్రగిరి వేణు, బండ రాకేష్, పోతు జగదీష్, ఖచ్చు మధు పాల్గొన్నారు.

● కట్టరాంపూర్‌లోని 11వ డివిజన్‌లో పిట్టల నాగన్న చౌరస్తా వద్ద పురం స్వామి ఆధ్వర్యంలో కార్పొరేటర్ ఆకుల నర్మదా నర్సన్న అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

●నగరంలోని సీపీఐ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ పాల్గొన్నారు.

● డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బస్‌స్టేషన్ కరీంనగర్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్, రీజినల్ మేనేజర్ సుచరిత, దొంత రాజయ్య, గండి లక్ష్మణ్, ప్రకాశ్ నాయక్ పాల్గొన్నారు.

●నగరంలోని భగత్‌నగర్, భగత్‌సింగ్ చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగారి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు.

●కరీంనగర్ టౌన్: నగర పాలక సంస్థ ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి నగర కమిషనర్ భువనగిరి శ్రీనివాస్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టౌనింగ్ ప్లానింగ్ డీసీపీ సుభాష్, రెవెన్యూ ఆఫీసర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

●నగరంలోని 33వ డివిజన్ భగత్‌నగర్ ఆదర్శ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకల్లో మేయర్ సునీల్‌రావు పాల్గొని నివాళులర్పించారు.

●కరీంనగర్ కల్చరల్: అంబేద్కర్ స్టేడియంలో తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. అనంతరం కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్ జన్మదిన వేడుక సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడి చంద్రయ్య, పీఎస్‌ఎన్ రాజు, సీవీ కుమార్, మేరుగు ప్రవీణ్, బూర్ల వేంకటేశ్వర్లు, గుండు రమణయ్య, అన్నవరం దేవేందర్, జలేందర్‌రెడ్డి, గజేందర్‌రెడ్డి, మమత వేణు, బాలసాని కొమురయ్య, ఎండి ఖాలిద్, కూకట్ల తిరుపతి, కందుకూరి అంజయ్య, కనకం శ్రీనివాస్, పుప్పాల శ్రీరాం, ఎన్ చైతన్య, ఎం చంద్రశేఖర్, కిషోర్‌కుమార్, దామరకుంట శంకరయ్య, విలాసాగరం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

●నగర శివారులోని బైపాస్‌రోడ్ అరుంధతి బుద్ధ వనంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. బుద్ధ వనం కమిటీ ప్రతినిధులు మేకల పరశురాం, గాలిపెల్లి కుమారస్వామి ఆధ్వర్యంలో వివిధ శాఖలకు చెందిన విశ్రాంత అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో అశోక్, రాజయ్య, హరి, శంకర్, రాజేందర్, శ్రీకాంత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

●కరీంనగర్ లీగల్: భారతదేశ పౌరులకు హక్కులు కల్పించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి శ్రీవాణి అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని జిల్లా కోర్టులోని మీడియేషన్ సెంటర్‌లో కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జిలు లక్ష్మీకుమారి, సాధన, నీరజ, కుమార్, వివేక్, వెంకటేష్, మేజిస్ట్రేట్‌లు షరీనా మమ్మద్, ప్రీతి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ గడ్డం లక్ష్మణ్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రాజ్‌కుమార్, బేతి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

●సుభాష్‌నగర్: కార్ఖానగడ్డలోని అంబేద్కర్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బైరం కుమార్, గౌరవాధ్యక్షుడు మెండి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి హరిబాబు పాల్గొన్నారు.

●ఎస్సీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్ బండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

●టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

●బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ పాల్గొన్నారు.

●జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంచార్జి డీవైఎస్‌వో కిష్టయ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీవైఎస్‌వో సురేష్, వింధ్యావాలి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ జి ప్రశాంత్, మాజీ జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కె సమ్మయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు వీరన్న, హన్మంతు, వి సూర్యప్రకాష్, క్రీడా శాఖ సిబ్బంది, చంద్రశేఖర్, రాజు, స్వామి పాల్గొన్నారు.

●స్థానిక అహ్మద్‌పురలోని ఆదర్శమాల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గంభీరావుపేట కొండయ్య, రాజారాం, శంకరయ్య, తిరుపతి, కనకయ్య, రవికాంత్, ఎడ్ల పార్థసారథి, మండల నాగరాజు, అనుమండ్ల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్: కొత్తపల్లి మండలంలోని ఆసిఫ్‌నగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు సాబీర్‌పాష, ఎంపీటీసీ దావ కమలమనోహర్, అత్తపురం తిరుపతి దావ రాజారామ్, దావ పర్శరాములు దావ ప్రభాకర్, దావ తిరుపతి తదితరులుపాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రూరల్ తహసీల్దార్ నవీన్, ఎంపీడీవో సంజీవరావు, ఆర్‌ఐ వాసవిక్, కార్యదర్శి ఇంతియాజ్, దళిత నాయకుడు గోష్కి శంకర్, జక్కనపల్లి శంకర్, ఎడెల్లిమల్లేశం, సముద్రాల అజయ్, గాలిపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

●కరీంనగర్ మండలంలోని ఎలబోతారం గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆడెపు శ్రీకాంత్, దారం జగన్నాథరెడ్డి, వేల్పుల శ్రీనివాస్, గాండ్ల గోపాల్, దేవేందర్, ఆనంద్, రవి పాల్గొన్నారు.

●రేకుర్తిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దుర్గం మారుతి, పిట్టల సత్యనారాయణ, గోదారి చంద్రయ్య, గొల్లె మల్లయ్య, బాసం కుమార్ పాల్గొన్నారు.

●చింతకుంటలో ఎంపీటీసీ భూక్య తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఈకార్యక్రమంలో లక్ష్మీనారాయణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

●కొత్తపల్లి పట్టణంలో మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

●హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ జయంత్యుత్సవ కమిటీల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, దళిత సంఘాల నాయకులు అంబేద్కర్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జయంతోత్సవ సభ జరిగింది.

●హుజూరాబాద్ రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు.

●హుజూరాబాద్ లీగల్: హుజూరాబాద్ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోస్కుల శ్రీనివాస్, అసోసియేషన్ కార్యదర్శి మట్టెల తిరుపతి, ఉపాధ్యక్షుడు బండి రమేష్, న్యాయవాదులు ముక్కెర రాజు, సత్యనారాయణ, బత్తుల తిరుపతి, విక్రమ్, వంశీకృష్ణ, హరిహరన్ పాల్గొన్నారు.

●జమ్మికుంట/జమ్మికుంట రూరల్: జమ్మికుంట పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఆదివారం ఘణంగా నిర్వహించారు. మోత్కులగూడెం చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నివాళులు అర్పించారు. మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నకోటి, మున్సిపల్ కమిషనర్ ఎండి ఆయాజ్‌లు, అంబేద్కర్ సంఘాల నాయకులు, కౌన్సిలర్లు వేర్వేరుగా నివాళులర్పించారు. తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ ఇంఛార్జ్ రాచపల్లి సాగర్ ఆధ్వర్యంలో స్పందన అనాథ శరణాలయంలో కేకు కట్ చేశారు. పట్టణంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు.

●శంకరపట్నం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ప్రజా సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●తిమ్మాపూర్: అలుగునూర్, మహాత్మానగర్, రేణికుంట, మన్నెంపల్లి గ్రామాలతో పాటు అంబేద్కర్ సంఘ భవనాలలో ఇతర గ్రామాలలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అనిత అంజనేయులు, నాయకులు పొన్నం అనిల్ గౌడ్, పారునంది జలపతి, మాతంగి లక్ష్మణ్ పాల్గొన్నారు.

●గన్నేరువరం: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. గునుకుల కొండాపూర్‌లో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

●వీణవంక: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

●సైదాపూర్: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు.

●ఇల్లందకుంట: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో లాల్ మహ్మద్, మహేందర్, మోహన్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

●మానకొండూర్: మండలంలోని మానకొండూర్, అన్నారం, వెల్ది, ఊటూర్, పచ్చునూర్, కొండపల్కల, దేవంపల్లి, చెంజర్ల, లింగాపూర్, రంగపేట గ్రామాలలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. మానకొండూర్‌లో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లిమోహన్, మాజీ సుడా చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు, జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్ పాల్గొని నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ఇస్కుల్ల అంజయ్య పాల్గొన్నారు.

●చొప్పదండి: చొప్పదండిలో అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం పట్టణ అధ్యక్షుడు పెద్దెల్లి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కడారి గంగరాజు, ఎంపీపీ చిలుక రవీందర్ పాల్గొన్నారు.

●రామడుగు: గోపాల్‌రావుపేట, రామడుగు, తిర్మాలాపూర్, వెలిచాలతో పాటు అన్ని గ్రామాల్లోని అంబేద్కర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్ చొప్పదండి అధ్యక్షుడు జెట్టిపల్లి అనిల్‌కుమార్, గజ్జెల అశోక్, ఈఏఎం ఫౌండేషన్ అంబేద్కర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో 30 బాలికలకు ఉచిత కరాటే శిక్షణ ప్రారంభించారు. గోపాల్‌రావుపేటలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, ఇన్‌చార్జి ఎంపీపీ పూరేల్ల గోపాల్, జవ్వాజి హరీష్, సత్యరాజ్ వర్మ, అశోక్ పాల్గొన్నారు.

●చిగురుమామిడి: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని ప్రొఫెసర్ జిలకర శ్రీనివాస్, కవి గేయ రచయిత మచ్చ దేవేందర్, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత పసునూరి రవీందర్ అన్నారు. మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో అంబేద్కర్ గ్రామ శాఖ అధ్యక్షుడు జేరిపోతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు, వివిధ పార్టీల జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, కోమటి రెడ్డి రాంగోపాల్‌రెడ్డి, వివిధ పార్టీల అధ్యక్షులు మామిడి అంజయ్య, పైడిపల్లి శ్రీనివాస్, బోయిని వంశీ, ఆకవరం శివప్రసాద్, సన్నీల వెంకటేశం, బోయిని శ్రీనివాస్, కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గన్నేరువరంలో ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు

గన్నేరువరం, ఏప్రిల్ 14: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99లో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పూర్వ ఉపాధ్యాయులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి వారి దీవెనలను పొందారు. 25 సంవత్సరాలు వెనుకకు వెళ్లి ఆటపాటలతో ఆనందంగా రోజంతా గడిపారు. గడిచిన 25 ఏళ్లలో కోల్పోయిన మిత్రులను, ఉపాధ్యాయులను స్మరించుకొని వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు రామచంద్రం, చంద్రయ్య, స్వామిరెడ్డి, శ్రీనివాసరాజు, రహీం, శ్రీనివాస్‌రెడ్డి, అనిత, పూర్వ అటెండర్లు రామస్వామి, శ్రీమాన్, మల్లేశం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సైదాపూర్‌లో..

సైదాపూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981-82 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కలుసుకొని ఒకరికొకరు అలింగణం చేసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాఠశాలలో సందడి వాతావారణం చోటు చేసుకుంది. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, సభా అధ్యక్షులు, వెన్కేపల్లి సింగిల్‌విండో అధ్యక్షులు కొత్త తిరుపతిరెడ్డి, గురువులు కియిత చిన్న రాజిరెడ్డి, కొత్త మల్లారెడ్డి, దామోదర్, శ్రీనివాస్, కార్యనిర్వాహకులు కాయిత భాస్కర్‌రెడ్డి, తుమ్మఅశోక్, నెల్లి పోచయ్య, పుల్లూరి వేణుగోపాల్, సత్యనారాయణ, రాజిరెడ్డి, లింగారెడ్డి, అమరజ్యోతి, లక్ష్మి, ఉమాదేవి, మల్లేష్, రమణాచారి, వెంకటేశ్వర్లు, సమ్మయ్య, రాములు, సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్ 36 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సిల్వర్ జూబ్లీ వేడుకలు

మానకొండూర్: మానకొండూర్ మండలంలోని ఖాదరగూడెంలోని అరవింద ఫామ్ హౌస్‌లో శంకరపట్నం మండలంలోని తాడికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997-98 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందాలను పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పూర్వ విద్యార్థులంతా కలిసి జ్ఞాపికలతో సన్మానించారు. అనంతరం గురువులు కాసు అయిలయ్య, శ్యాంసుందర్, కాళిదాస్, రమేష్‌బాబు, రాంరెడ్డి, కుమారస్వామిలు మాట్లాడుతూ పాఠశాలలో చదివిన జ్ఞాపకాలు ఎప్పుడు గుర్తుండిపోతాయన్నారు. పూర్వ విద్యార్థులందరూ కలిసి వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆట పాటలతో నృత్యాలు చేసి ఆనందాలను పంచుకున్నారు.


వెన్కేపల్లి పాఠశాలలో సమావేశమైన 1981-82 బ్యాచ్ విద్యార్థులు

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

-మాజీ ఎంపీ వినోద్‌కుమార్

గంగాధర, ఏప్రిల్ 14: ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలని మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. ఆదివారం గంగాధర మండలం మధురానగర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లులు అలాట్ చేయకపోవడంతో రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. బోనస్ దేవుడెరుగు మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులపై చిత్తశుద్ధి ఉంటే ఎందుకు మిల్లులు అలాట్ చేయలేదు, ఎందుకు తూకం వేయడంలేదని ప్రశ్నించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులున్నారు.

వైభవంగా కుంకుమ పూజ

వీణవంక,ఏప్రిల్14: మండలంలోని కనపర్తి గ్రామంలో పురాతన శివాలయ పునరుద్ధరణ,.ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమములో భాగంగా మహిళలతో కుంకుమ పూజ,ఉత్సవ విగ్రహాలకు ధ్యాన,ఫల,పుష్పాదివాసాలు హమాదులు నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు గూడ జగదీశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ప్రమాణ స్వీకారం

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 14: జమ్మికుంట పట్టణంలోని సువర్ణ ఫంక్షణ్‌హాల్‌లో ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మి-నారాయణ హజరయ్యారు. పట్టణ అధ్యక్షులు కెఆర్‌వి నర్సయ్య, మహిళ విభాగం అధ్యక్షురాలు ముక్క మాధవి, యువజన విభాగం అధ్యక్షులు తంగెళ్లపల్లి శ్యాంకిషోర్‌లు వారి కార్యవర్గాలతో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మి-నారాయణ, జిల్లా అధ్యక్షులు చందా రాజులు వేర్వేరుగా మాట్లాడుతూ సంఘం సభ్యులు వైశ్య సంఘం సభ్యత్వాలు పెంచుకోవాలని, సంఘం పటిష్టతకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో కొండ్లె మల్లిఖార్జున్, ఆగిరి వెంకటేష్, ఉప్పల శారద, కాచం సుష్మ, ఎన్ సామ్రాజ్యలక్ష్మి, కన్న కృష్ణ, శివనాధుని శ్రీనివాస్, బచ్చు భాస్కర్, ఎలిమిల్ల రాజేంద్రప్రసాద్, యాద సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

రామడుగు, ఏప్రిల్ 14: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం వేదపండితుల మంత్రోత్సవాల మధ్య అంగరంగా వైభవంగా జరిగింది. తాజామాజీ సర్పంచ్ కర్ర సత్యప్రసన్న వెంకటరాంరెడ్డి దంపతులు తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో సీతారాంరెడ్డి, రమేష్, బాబు, కనుకయ్య, రాజిరెడ్డి,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిలో అధికార, విపక్ష నాయకులు


ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కేక్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, ఏప్రిల్ 14: గంగాధరలో అన్ని పార్టీల నేతలు, వివిధ సంఘాల నాయకులు అంబేద్కర్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌లు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఇద్దరు నాయకులు కలిసి వేడుకలు జరుపుకోవడంతో అక్కడున్న కార్యకర్తలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఒకే చోట ఇద్దరు నాయకులు కలువడంతో కార్యకర్తలు ఉత్సాహంగా కనిపించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుల్కం అనురాధ నర్సయ్య, ఆయా గ్రామాల ఎంపిటీసీలు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.